# సాక్షి
## విజయనగరం

బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023




**పరామర్శకు వెళ్తూ... మృత్యు ఒడిలోకి...** -8లో

బంధువుల ఇంటికి పరామర్శకు వెళ్లిన ఇద్దరిని మృత్యువు కాటేసింది.



**వాసవీనగర్‌లో భారీ చోరీ**

పట్టణ పరిధి వాసవీనగర్‌లో సోమవారం రాత్రి భారీ చోరీ జరగడంతో కాలనీవాసులు ఉలిక్కిపడ్డారు. -8లో



**లక్ష్యాలను చేరుకోకపోతే చర్యలు తప్పవు** -8లో

నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోనివారిపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

## న్యూస్‌రీల్

### శివుని విగ్రహాన్ని చుట్టేసిన నాగుపాము



శివుని విగ్రహం మెడలో చుట్టుకున్న పామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్

విజయనగరంటౌన్: విజయనగరం వైఎస్సార్ కాలనీలో ఏర్పాటుచేసిన వరసిద్ధి వినాయక వేంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆలయం బయట ఏర్పాటుచేసిన శివపార్వతుల విగ్రహాల వద్దకు సోమవారం మధ్యాహ్నం ఓ నాగుపాము వచ్చి శివుని మెడలో చుట్టుకుని ఉంది. ముందు అందరూ బొమ్మ అనుకున్నారు. బతికున్న నాగుపాము అని గుర్తించడంతో భయందోళన చెందారు. దూరంగా వెళ్లి భక్తితో నమస్కరించారు. వెంటనే పాములను పట్టే వ్యక్తిని పిలిపించి నాగుపామును తీయించి, దూరంగా విడిచిపెట్టారు. అది ఏ సమయంలో వచ్చిందో ఎవరికీ తెలియ లేదని నిర్వాహకులు తెలిపారు.

### యువజనోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్

విజయనగరం అర్బన్: సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 21న నిర్వహించనున్న జిల్లా స్థాయి యువజనోత్సవాల బ్రోచర్‌ను సెట్విజ్ ముఖ్యకార్యదర్శి బి.రామ్‌గోపాల్ మంగళవారం ఆ కళాశాలలో ఆవిష్కరించారు. జానపద నృత్యాలు (బృందం, సోలో), జానపద గీతాలు (బృందం, సోలో), జీవిత నైపుణ్య విభాగంలో స్టోరీ రైటింగ్ (సోలో), పోస్టర్ మేకింగ్ (సోలో), డిక్లమేషన్ (ప్రకటన, సోలో), ఫొటోగ్రఫీ (సోలో), సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆరోగ్యం మరియు శరీర దృఢత్వం విభాగంలో యోగా ప్రదర్శన (బృందం), ఫుడ్ ఫెస్టివల్ (మిల్లెట్స్) పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు పాల్గొన్నారు.

### బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకులు సోమవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్టాపన, వాస్తు హోమాలను నిర్వహించారు. అనంతరం గ్రామ బలిహరణం చేపట్టి... వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా కొనసాగాలని ధ్వజస్తంభం పైకి గరుత్మంతుడి చిత్రపటాన్ని ఎగురవేసి సమస్త దేవతామూర్తులను ఉత్సవాలకు ఆహ్వానించారు. సాయంత్రం వెంకటేశ్వరస్వామిని ప్రత్యేక పల్లకిలో గ్రామ తిరువీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

# సిరిమాను సంబరానికి సన్నద్ధం



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్ససత్యనారాయణ

- పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరం ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళిక
- ప్రజాప్రతినిధులు, అధికారులు విస్తృత సమావేశం
- విభాగాల వారీగా జిల్లా ఉన్నతాధికారులకు బాధ్యతలు
- సామాన్య భక్తుల సంతృప్తే లక్ష్యంగా ఏర్పాట్లు
- రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ



హాజరైన అధికారులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవాలను అక్టోబర్ 30, 31 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. అమ్మవారి ఉత్సవాల నిర్వహణపై కలెక్టరేట్ ఆడిటోరియంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా పైడితల్లి అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈసారి గతం కంటే మిన్నగా ఉత్సవాన్ని జరిపేందుకు ఏర్పాట్లు చేయాలని, గతంలో చోటుచేసుకున్న చిన్నచిన్న లోపాలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది కూడా విజయనగరం ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 29న వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఆలయ కమిటీ ప్రతినిధులు, జీవితకాల సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. వారందరి అభిప్రాయాలను తీసుకొని ఉత్సవ నిర్వహణకు ఒక ప్రణాళికను తయారుచేయాలని మంత్రి సూచించారు. ఉత్సవాల నిర్వహణకు చుట్టుపక్కల జిల్లాల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాదిమంది భక్తులు తరలి వస్తారని, వారందరినీ దృష్టిలో పెట్టుకొని తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి అధికారి అమ్మవారి ఉత్సవాన్ని తమ వ్యక్తిగతమైన కార్యక్రమంగా భావించాలని చెప్పారు. సామాన్య భక్తుల సంతృప్తే లక్ష్యంగా ఏర్పాట్లు ఉండాలన్నారు.

**తగిన జాగ్రత్తలతో ఉత్సవాలు...**

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, ఈ ఏడాది ఇంతకుముందు కంటే వైభవంగా పైడితల్లి అమ్మవారి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. అమ్మవారి ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే ఆలయం తూర్పువైపు దుకాణాలను తొలగించామని, ఉత్సవాలకు ముందే పశ్చిమవైపు కూడా తొలగిస్తామని చెప్పారు. గత ఏడాది సిరిమానోత్సవం కొద్దిగా ఆలస్యం అయ్యిందని, ఈసారి పునరావృతం గాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సిరిమానోత్సవం అనంతరం కోట వద్ద పులివేషాల పోటీ, రాజీవ్ స్టేడియంలో బాణసంచా కాల్పులు ఉంటాయని చెప్పారు. వీఐపీల తాకిడి కారణంగా సామాన్య భక్తులు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. వీలైనంత వరకు సోమవారం నాటికే వీఐపీల దర్శనాలు పూర్తి చేసుకుంటే మంగళవారం నాడు ఇబ్బందులు ఉండవన్నారు. వీఐపీలతో పాటు పెద్ద సంఖ్యలో వారి అనుచరులు ఆలయంలోకి ప్రవేశిస్తుండటంవల్ల భక్తుల దర్శనాలకు ఇబ్బంది కలుగుతోందని, దీనిని నియంత్రించాలని సూచించారు. ఈ ఏడాది కూడా వీఐపీ పాస్‌లను రద్దు చేయాలని, సామాన్య భక్తులు దర్శనానికి ఇబ్బంది పడకుండా చూడాలని కోలగట్ల కోరారు.

**అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలు...**

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, వీఐపీల దర్శనాల సమయంలో కూడా సామాన్య భక్తుల దర్శనాలు కొనసాగేలా చూడాలని అధికారులన కోరారు. దీనివల్ల సాధారణ భక్తులకు ఎటువంటి ఇబ్బందీ వాటిల్లదని అన్నారు. సిరిమాను తీసుకువచ్చి, సిద్ధం చేసే ప్రక్రియలో అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండాలని, జాప్యం జరగకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, డీఆర్వో ఎస్‌డీ అనిత, పైడితల్లి అమ్మవారి ఆలయ ఈఓ సుధారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### సిరిమానోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు...



సిరిమానోత్సవంపై జిల్లా కలెక్టర్‌కు వివరిస్తున్న ఆలయ ప్రధాన పూజారి వెంకటరావు

అక్టోబర్ 30, 31 తేదీల్లో జరిగే పైడితల్లి అమ్మవారి తొలేళ్లు, సిరిమానోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖల అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. సిరిమానోత్సవం గురించి సిరిమాను పూజారి వెంకటరావు కలెక్టర్‌కు వివరించారు. పైడితల్లి అమ్మవారి ఉత్సవాలతో పాటు విజయనగరం ఉత్సవాలను కూడా ఈ ఏడాది నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. త్వరలో వేదికలను పరిశీలించి ఖరారు చేస్తామని చెప్పారు. అమ్మవారి పండుగ, విజయనగరం ఉత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు ఉండాలన్నారు. భక్తులు ఉత్సవాలకు వచ్చి వెళ్లే విధంగా ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. 15 పడకలతో ఆస్పత్రిని సిద్ధం చేయాలని, సమీప ఆస్పత్రులను అప్రమత్తంగా ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులకు సూచించారు. తెప్పోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, గజ ఈతగాళ్లను, లైఫ్ జాకెట్లను సిద్ధంగా ఉంచాలని మత్స్య శాఖను ఆదేశించారు. అగ్నిప్రమాదాలు సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. నాణ్యమైనప్రసాదం, ఆహార పదార్థాలను అందించేలా చూడాలన్నారు. అమ్మవారి సిరిమానోత్సవాన్ని, విజయనగరం ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ కోరారు.

### పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు



చండీయాగంలో పాల్గొన్న ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి




పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరంటౌన్: విజయనగరం పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు అమ్మవారికి విశిష్ట పూజలు జరిపారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. చదురుగుడి ఆలయం వద్ద వేదపండితుడు దూసి శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా చండీయాగం జరిపారు. ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# ఊరూరా గణపతి ఉత్సవం

ఊరూరా గణపతి నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అందంగా ముస్తాబుచేసిన మండపాల్లో ముహూర్తం ప్రకారం వివిధ రూపాల్లో దర్శనమిచ్చేలా వినాయక విగ్రహాలను ప్రతిష్టించారు. ప్రత్యేక పూజలు జరిపారు. సకల విఘ్నాలు తొలగించే పార్వతీ పుత్రునికి మనసారా అర్చనలు చేశారు. ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. కొన్ని గ్రామాల్లో తొలిరోజే అనుపోత్సవాలను నిర్వహించారు. గణపతి విగ్రహ తిరువీధిని సందడిగా నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్



తోటపాలెం బొత్సపేటలో ఐదువేల బిస్కెట్ ప్యాకెట్లతో రూపుదిద్దుకున్న 18 అడుగుల గణనాథుడు



విజయనగరం బాలాజీ మార్కెట్‌లో 2వేల డ్రింక్ బాటిళ్లతో 30 అడుగుల రసమయ వినాయకుడు



కొత్తవలస మండలం తుమ్మికాపల్లి గేటు వద్ద శ్రీవారి ఆలయం నమూనాలో ఏర్పాటు చేసిన వినాయక మండపం



చీపురుపల్లి: జి.అగ్రహారంలో రామసేతు నిర్మాణ ఘట్టం ఆకారంలో బొజ్జగణపయ్య



రాజాం సిటీ: పొనుగుటివలస గ్రామంలో ఏర్పాటుచేసిన చంద్రయాన్-3 రాకెట్ సెట్



బొబ్బిలి: రైల్వేస్టేషన్‌దరి మల్లంపేటలో (విశాఖ-బొబ్బిలి-సాలూరు) కొత్త రైలు రాక శుభసూచకంగా రైలు ఆకారంలో వినాయకుడి సెట్



సంతకవిటి: శ్రీహరినాయుడుపేటలో గణపయ్య దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

### పల్లెల ప్రగతికి 'ఉపాధి' ఊతం

- ప్రతి మండలానికి రూ.60 లక్షల నిధులు
- జిల్లా వ్యాప్తంగా రూ.16.20 కోట్ల నిధుల కేటాయింపు
- సీసీ డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం

విజయనగరం ఫోర్ట్: పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం ఉపాధిహామీ పథకం నిధులను వెచ్చిస్తోంది. స్థానికులకు పెద్ద ఎత్తున పనులు కల్పించి వలసల నివారణే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. పనుల ప్రణాళికను పక్కాగా అమలుచేస్తోంది. ఏడాదికి ఒక్కో కుటుంబానికి ఉపాధిహామీ పథకం పనులతో రూ.15వేలు నుంచి రూ.20వేల వరకు వేతనం గిట్టుబాటయ్యేలా అభివృద్ధి పనులు చేయిస్తోంది. గ్రావెల్ రోడ్లు, కల్వర్టులు, చప్టాలు, సాగునీటి వనరుల అభివృద్ధి పనులకు అధిక శాతం నిధులను కేటాయిస్తోంది. తాజాగా ప్రతి మండలానికి అభివృద్ధి పనుల కోసం రూ.60 లక్షల చొప్పున మంజూరు చేసింది. విజయనగరం జిల్లాలోని 27 మండలాలకు మొత్తంగా రూ.16.20 కోట్ల నిధులు కేటాయించింది. వీటితో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నట్టు డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి తెలిపారు.

# దేశానికే ఆదర్శనీయం



మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్

విజయనగరం రూరల్/విజయనగరం ఫోర్ట్: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వివిధ కార్పొరేషన్ పదవులు, పార్టీ పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం నేడు దేశానికే ఆదర్శవంతంగా నిలిచిందని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ మంగళవారం ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో జెడ్పీ చైర్మన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, మహిళా సాధికారతకు కృషి చేస్తూ సంక్షేమ పథకాల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.



డాక్టర్ అవనాపు భావన, డీసీఎంఎస్ చైర్‌పర్సన్

- మహిళలకు పెద్దపీట వేస్తున్న కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయంగా, సంక్షేమ పథకాల్లో మహిళలకు పెద్దపీటవేస్తూ, మహిళా సాధికారతకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలు నేడు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు.

### ● భలే పొట్లకాయ



సీతంపేట ఐటీడీఏ డిప్యూటీ ఈఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లాభాల ఉమామహేశ్వరరావు పెరటిలో భారీ పొట్లకాయ కాసింది. సాధారణంగా పొట్లకాయలు 4 అడుగుల మేర పెరుగుతాయి.. చిత్రంలో కనిపిస్తున్న పొట్లకాయ మాత్రం ఏకంగా 7 అడుగులు పెరగడం విశేషం. దీనిని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

- సీతంపేట

# పేద రైతుకు 'పట్టా'భిషేకం

- అసైన్డ్ భూముల్లో సేద్యం చేస్తున్న రైతులకు హక్కు పత్రాలు
- పంపిణీకి కసరత్తు చేస్తున్న జిల్లా యంత్రాంగం
- 2,201 ఎకరాల్లో 2,926 మందికి పట్టాలు అందించేందుకు సన్నాహాలు
- దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభిస్తుందని సర్వత్రా హర్షం



అసైన్డ్ భూములను సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

పాలకొండ రూరల్: దశాబ్దాలుగా అసైన్డ్ భూములను సాగుచేస్తూ జీవిస్తున్న రైతులకు శుభవార్త. అసైన్డ్‌భూములు సాగుచేస్తున్న పేద రైతులకు హక్కులు కల్పిస్తూ పట్టాలు అందజేయాలని జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు కసరత్తు ప్రారంభించింది. అర్హులైన రైతులను గుర్తించింది. పట్టాదారులందరికీ వైఎస్సార్ రైతు భరోసా వర్తింపుతో పాటు బ్యాంకు రుణాలు, వ్యవసాయ రాయితీలు అందజేయాలని నిర్ణయించింది.

**పార్వతీపురం మన్యం జిల్లాలో 165 గ్రామాల్లో...**

జిల్లాని 15 మండలాల పరిధిలో 165 రెవెన్యూ గ్రామాల్లో దాదాపు 2,201.61 ఎకరాల అసైన్డ్ భూములను దీర్ఘకాలంగా 2,926 మంది రైతులు సాగుచేస్తున్నట్టు జిల్లా అధికారులు గుర్తించారు. నియోజకవర్గాల వారీగా పార్వతీపురంలోని 19 గ్రామాల్లో 469 మంది రైతులు 309.46 ఎకరాల్లోను, పాలకొండలోని 47 గ్రామాల్లో 927 మంది రైతులు 600.19 ఎకరాల్లోను, కురుపాంలో 66 రెవెన్యూ గ్రామాల్లో 1189 మంది రైతులు 923.43 ఎకరాల్లోను, సాలూరులోని 33 గ్రామాల్లో 341 మంది రైతులు 368.53 ఎకరాల అసైన్డ్ భూముల్లో పంటలు సాగుచేస్తున్నట్టు సర్వేలో నిర్ధారించారు. వీరందరికీ సంబంధిత భూమికి హక్కు పత్రాలు అందజేసేందుకు అధికారులు కసరత్తుచేస్తున్నారు.

### అర్హులందరికీ న్యాయం



జిల్లాలో అసైన్డ్ భూములు సేద్యం చేస్తున్న అర్హులందరికీ ప్రభుత్వం న్యాయం చేయనుంది. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నప్పటికీ హక్కులు పొందనివారికి పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు పకడ్బందీ కసరత్తు చేస్తున్నాం. ఇప్పటికే సర్వే పూర్తి చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్‌లో పట్టాలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. కలెక్టర్ సూచనలతో ఈ ప్రక్రియ సాగుతుంది. పట్టాలు పొందిన రైతులకు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు పొందవచ్చు.

– జల్లెపల్లి వెంకటరావు, డీఆర్వో, పార్వతీపురం మన్యం

**జిల్లాలో అసైన్డ్ భూములు... లబ్ధిదారుల వివరాలు ఇలా....**

| మండలం | గ్రామాలు | అర్హత పొందిన రైతులు | భూ విస్తీర్ణం (ఎకరాల్లో) |
|---|---|---|---|
| పార్వతీపురం | 11 | 166 | 215.81 |
| సీతానగరం | 6 | 261 | 66.20 |
| బలిజిపేట | 2 | 42 | 27.45 |
| పాలకొండ | 10 | 445 | 201.65 |
| సీతంపేట | 11 | 113 | 150.65 |
| భామిని | 22 | 222 | 144.87 |
| వీరఘట్టం | 4 | 147 | 103.02 |
| కురుపాం | 9 | 81 | 98.70 |
| గుమ్మలక్ష్మీపురం | 15 | 143 | 136.34 |
| జియ్యమ్మవలస | 17 | 155 | 144.67 |
| గరుగుబిల్లి | 11 | 389 | 186.09 |
| కొమరాడ | 14 | 421 | 357.63 |
| సాలూరు | 5 | 86 | 76.91 |
| పాచిపెంట | 13 | 153 | 224.82 |
| మక్కువ | 15 | 102 | 66.80 |

## క్లుప్తంగా

### వాటర్ ప్లాంట్‌లపై కేసులు



వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న ఆహార తనిఖీ అధికారి వెంకటరమణ

మెంటాడ(గజపతినగరం రూరల్): నిబంధనలను అతిక్రమించి నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్‌లపై కేసులు నమోదు చేయడం జరిగిందని జిల్లా ఆహార తనిఖీ అధికారి ఈశ్వరి అన్నారు. మంగళవారం తన సిబ్బందితో కలసి గజపతినగరం పట్టణంలోని పలు వాటర్ ప్లాంట్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికులు ఫిర్యాదు మేరకు నగరంలోని లక్కీడ్రాప్, ప్రవల్లిక అనే వాటర్ ప్లాంట్‌లను తనిఖీలు చేయడం జరిగిందన్నారు. ఈ రెండు కేంద్రాలు నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహించడం జరుగుతుందని గుర్తించి కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ నగరంలో పలు హోటళ్లు, అల్పాహార దుకాణాలు, జ్యూస్ పార్లర్‌లు, అలాగే పాల పదార్థాల విక్రయ కేంద్రాలు, మిఠాయి దుకాణాలతో పాటు ఆహారాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలకు అందించే ప్రతీ కేంద్రం కూడా నిబంధనలు పాటించి విక్రయాలు జరపాలన్నారు. లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఆమెతో పాటు గజపతినగరం క్లస్టర్ సిబ్బంది వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### అరకు-విశాఖ రోడ్డులో ప్రమాదం



లారీ వెనుక భాగంలో ఢీకొట్టిన బైక్

కొత్తవలస: మండలంలోని అరకు - విశాఖ రోడ్డులో అప్పన్నపాలెం గ్రామం సమీపంలో గల తాటిపూడి రిజర్వాయర్ పంప్‌హౌస్ వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో లక్కవరపుకోట గ్రామానికి చెందిన గణేష్ అనే యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు అందించిన వివరాలు ఇలా వున్నాయి. గణేష్ తన ద్విచక్ర వాహనంపై ఎల్.కోట నుంచి కొత్తవలస వైపు వెళ్తుండగా ముందర వెళ్తున్న లారీ ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేసాడు. దీంతో గమనించని గణేష్ తన వాహనంతో లారీ వెనుక భాగంలో ఢీకొట్టాడు. తీవ్ర గాయాల పాలైన గణేష్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.


### లారీ బోల్తా



బంగారమ్మపేట వద్ద బోల్తా పడిన లారీ

కొమరాడ: మండలంలోని బంగారమ్మపేట గ్రామ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై మంగళవారం రాయఘడ నుంచి పార్వతీపురం వైపు వస్తున్న లారీ గొయ్యిను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో ఎదురుగా ఎలాంటి వాహన రాకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్, క్లీనర్ సురక్షితంగానే ఉన్నారు.

### అల్యూమినియం లోడు లారీ బోల్తా...



బోల్తా పడ్డ భారీ వాహనం

బొబ్బిలి: మండలంలోని పారాది, గొర్లె సీతారాంపురం మధ్య డౌన్‌లో మంగళవారం వేకువ జామున భారీ వాహనం బోల్తా పడింది. విశాఖపట్నం నుంచి అల్యూమినియం లోడుతో ఝార్సిగుడా వెళ్తోందని వాహన డ్రైవర్, సిబ్బంది తెలిపారు. భారీ వాహనం బోల్తా పడటంతో ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా ఏఎస్‌ఐ కొండలరావు, ట్రాఫిక్ సిబ్బందిని తీసుకువెళ్లి లైన్ క్లియర్ చేశారు.

## పరామర్శకు వెళ్తూ...
# మృత్యు ఒడిలోకి...

- ఆటో బోల్తా : ఇద్దరి మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- ముగ్గురికి స్వల్ప గాయాలు



ప్రమాద స్థలంలో శ్రీనివాసరావు

గంట్యాడ: బంధువుల ఇంటికి పరామర్శకు బయలుదేరి మృత్యు ఒడిలోకి చేరిన విషాద ఘటన ఇది. బంధువుల ఇంటికి వెళ్లేలోపే ఆటో బోల్తా పడి ఇద్దరు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనతో మృతుల కుటుంబాల్లో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పెదవేమలి గ్రామానికి చెందిన కొందరు సోమవారం మురపాక గ్రామంలో తమ బంధువు ఒకరు మృతి చెందడంతో పరామర్శకని ఆటోలో బయలుదేరి వెళ్లారు. మురపాక గ్రామ సమీపంలో ఉన్న కోనేరు వద్దకు వచ్చేసరికి ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న సిరపురపు సత్యం(60), పొట్నూరు శ్రీనివాసరావు(53), పాటుపురెడ్డి కొండమ్మ, పాటుపురెడ్డి సత్యవతికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్యం, శ్రీనివాసరావు మృతి చెందారు. కొండమ్మ, సత్యవతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరితో పాటు మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.



శ్రీనివాసరావు (ఫైల్)



సత్యం(ఫైల్)

మృతుడు శ్రీనివాసరావుకు ఇద్దరు కుమార్తెలు కాగా.. వారిలో పెద్ద కుమార్తెకు వివాహమైంది. రెండో కుమార్తెకు ఇటీవల వివాహం నిశ్చమైంది. ఈ తరుణంలో ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసెలా రోదిస్తున్నారు. ఆటో డ్రైవర్ సిరపురపు వినోద్ నిర్లక్ష్యంగా.. అతి వేగంగా ఆటోను నడపడం వల్లే ప్రమాదం జరిగిందని ఎస్ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని..



నాగేంద్రకుమార్(ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని మర్రివలస వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మరడాం గ్రామానికి చెందిన తాడి నాగేంద్రకుమార్(24) మృతి చెందినట్లు ఎస్ భూర్జవలస హెచ్‌సీ బెడ్సన్ తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద స్నేహితులతో సరదాగా గడిపిన అనంతరం రాత్రి 9 గంటల సమయంలో మర్రివలసలో స్నేహితుడిని దింపడానికి ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా వెనుక నుండి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు చెల్లెళ్లు ఉండగా తల్లి గ్రామంలో ఆశా కార్యకర్తగా, తండ్రి ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. మృతుడు తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

## రైలు నుంచి జారిపడి యువకునికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరమణ్యకుమార్ భూషణ్

పార్వతీపురం టౌన్: బెంగళూరు నుండి టాటానగర్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు నుండి జారిపడి యువకునికి తీవ్ర గాయాలైన సంఘటన పార్వతీపురం టౌన్ రైల్వేస్టేషన్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. బెంగళూరు నుండి టాటానగర్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న జార్ఖండ్ రాష్ట్రం పాలము జిల్లా కూర్హాట్ పోస్టు కువా ఖోహ గ్రామానికి చెందిన వీరమణ్యకుమార్ భూషణ్ పార్వతీపురం టౌన్ రైల్వేస్టేషన్ వద్దకు వచ్చేసరికి రైలు నుండి జారిపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్సను అందించారు. వివరాలను నమోదు చేసినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రత్నకుమార్ తెలిపారు.

**లారీ ఢీకొని వ్యాన్ డ్రైవర్‌కు..**



గాయపడిన ఇళ్లా రఘు

పార్వతీపురం టౌన్: లారీ ఢీకొనడంతో వ్యాన్ డ్రైవర్‌కు గాయాలైన సంఘటన మంగళవారం పార్వతీపురం పట్టణంలో చోటు చేసుకుంది. జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పార్వతీపురం పట్టణం కొత్తవలస నందమూరి కాలనీకి చెందిన ఇళ్లా రఘు వ్యాన్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం తన వ్యాన్‌ను కొత్తవలస నుండి ఎస్‌ఆర్ పేటకు స్కూల్ పిల్లలను తీసుకొని రావడానికి వెళ్తుండగా మార్గమధ్యంలో రైల్వే ఫ్లెటోవర్ బ్రిడ్జి నుంచి బైపాస్ రోడ్డు లారీ యూనియన్ ఆఫీస్ వద్ద మెయిన్ రోడ్డుపై వ్యాను వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రఘుకు గాయాలయ్యాయి. వ్యాన్ ముందు భాగం నుజ్జయ్యింది. గాయపడిన అతడ్ని లారీ డ్రైవర్ 108 వాహనానికి కాల్ చేసి పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలపై అవుట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి చేస్తున్నారు.

**రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు**



రోడ్డుపై తీవ్ర గాయాలతో శ్రీకాంత్

బొబ్బిలి: మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన గొండేల శ్రీకాంత్, తేజ అనే ఇద్దరు వ్యక్తులు మంగళవారం సాయంత్రం కోమటి పల్లి వెళ్తున్నారు. మార్గ మధ్యంలో ఉన్న రైస్‌మిల్లు సమీపాన ఉన్న మలుపు వద్ద ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న స్కూటీకి తగిలి పడిపోయారు. ఈ సమయంలో శ్రీకాంత్ కాళ్ల మీదుగా వెనుక చక్రం వెళ్లిపోయింది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 వాహనంలో బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించగా అక్కడి నుంచి విజయనగరం కేంద్రాస్పత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించినట్టు ఏఎస్‌ఐ బీవీ రమణ తెలిపారు. ఇతనితో పాటు ప్రయాణిస్తున్న తేజ ఆచూకీ కానరాలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### పాము కాటుతో మహిళ మృతి

గంట్యాడ: పాము కాటుతో ఓ మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పెదమజ్జిపాలేం గ్రామానికి చెందిన పైల అంజలి( 28) సోమవారం ఇంటి ఆవరణంలో కరివేపాకు కోయడానికి వెళ్లగా అక్కడ పాము కాటు వేసింది. దీంతో వారి కుటుంబ సభ్యులు గ్రామంలో ఉన్న పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ ఎస్‌వీ రమణమూర్తి తెలిపారు.

## టీచర్ల వేతనాలకు తొలగిన అడ్డంకులు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు వేతనాల చెల్లింపుల్లో ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టుల మదింపు (కేడర్ స్ట్రెంగ్త్) పూర్తి చేసిన విద్యాశాఖాధికారులు ఆయా పోస్టుల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించడంతో ఎదురైన సాంకేతిక ఇబ్బందులకు పరిష్కారం చూపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఎంఈఓ-2 పోస్టుల భర్తీ నేపథ్యంలో ఖాళీ అయిన హెచ్‌ఎం (వేతన డ్రాయింగ్ అధికారి) స్థానంలో డ్రాయింగ్ అధికారుల ప్రక్రియ జరగకపోవడం వల్ల ఆయా హెచ్‌ఎంల పరిధిలోని స్కూల్ అసిస్టెంట్ టీచర్ల వేతనాలు, ఎంఈఓ-1, ఎంఈఓ-2 పోస్టుల్లోకి కొత్తగా అధికారుల రాక, వేతనాలు చెల్లించే డ్రాయింగ్ అధికారుల బదలాయింపు ప్రక్రియలో ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించడంలో కొంత జాప్యం కలిగింది. ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి దిగిన విద్యా శాఖ ఉన్నతాధికారులు మండలాల వారీగా ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు.

## వాసవీనగర్‌లో భారీ చోరీ

- సుమారు 29 తులాల బంగారు ఆభరణాలు, రూ.2.50లక్షల నగదు చోరీ
- ఉలిక్కిపడిన కాలనీవాసులు



ఘటనా స్థలం వద్ద వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

రాజాం సిటీ: పట్టణ పరిధి వాసవీనగర్‌లో సోమవారం రాత్రి భారీ చోరీ జరగడంతో కాలనీవాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కాలనీలో నివాసం ఉంటున్న గొద్దు వెంకటరమణ వినాయక చవితి పండగ కోసం స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం ఎందువ గ్రామానికి కుటుంబ సభ్యులతో కలసి వెళ్లాడు. యథావిధిగా మంగళవారం ఉదయం వాసవీనగర్‌లో ఉన్న తన ఇంటికి వచ్చి చూసేసరికి సందులోని గ్రిల్స్‌కు వేసిన తాళం తీసి ఉండడంతో ఆందోళన చెంది ఇంట్లోకి వెళ్లి చూశారు. ఇంట్లోని బీరువాలు కూడా తెరిచి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ కె.రవికుమార్‌తో పాటు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీలను తనిఖీ చేశారు. అనంతరం క్లూస్‌టీంకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. సుమారు 29 తులాల బంగారంతో పాటు రూ.2.50లక్షల నగదు చోరీకి గురైనట్లు బాధితులు లబోదిబోమంటున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.రవికుమార్ తెలిపారు. పట్టణంలో గస్తీ ముమ్మరం చేయనున్నామని, ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో తమకు తెలియజేయాలని సూచించారు. అలాగే ఇళ్లల్లో పెద్ద మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు ఉంచకుండా జాగ్రత్తపడాలని సూచించారు.

**తాళాం వేసిన ఇళ్లే లక్ష్యంగా...**

పట్టణంలో జరుగుతున్న దొంగతనాలు తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా జరుగుతున్నాయి. సోమవారం రాత్రి వాసవీనగర్‌లో ఉపాధ్యాయులు వెంకటరమణ కుటుంబ సభ్యులు స్వగ్రామం వెళ్లిపోవడం గమనించి దొంగతనానికి పాల్పడ్డారు. అలాగే రెండు నెలల క్రితం బొబ్బిలి రోడ్డులోని ఫైర్ స్టేషన్ సమీపంలో ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించి అర్ధరాత్రి సమయంలో దొంగలు చొరబడిన విషయం విదితమే. ఈ ఘటనలో కూడా ఆరు తులాల బంగారం అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఇలా మరిపించి దొంగతనాలకు పాల్పడడంతో పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రాత్రి గస్తీ మరింత ముమ్మరం చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

## యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన జన్ని ప్రసాద్

పార్వతీపురం టౌన్: గడ్డి మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం పార్వతీపురం మండలంలో చోటు చేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మండలం శివన్నదొరవలస గ్రామానికి చెందిన జన్ని ప్రసాద్ (25) వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో వరహాల గెడ్డ డ్యాం దగ్గర గడ్డి మందు తాగి అక్కడి చింత చెట్టు కింద పడి ఉన్నాడు. డ్యాం దగ్గర చేపలు పడుతున్న వరసకు బావలైన పాలక త్రినాథ్, శంకర్రావులు చింత చెట్టు కింద పడి ఉన్న ప్రసాద్‌ను గమనించి విషయం అడగగా జరిగిన విషయం చెప్పడంతో వెంటనే బైకుపైన పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమించంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

**వ్యక్తి ఆత్మహత్య**



సోములు మృతదేహం

బాడంగి: మద్యానికి బానిసైన తనను వదిలేసి వెళ్లిన భార్య ఎంత పిలిచినా తిరిగి ఇంటికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని గొల్లాది గ్రామానికి చెందిన రేగు సోములు(50) మద్యానికి బానిసై కుటుంబ వివాదాల నడుమ సోమవారం మధ్యాహ్నం గడ్డి మందు తాగాడు. గుర్తించిన బంధువులు స్థానిక సీహెచ్‌సీకి 108 వాహనంలో తరలించారు. అక్కడ వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించగా అక్కడ మృతి చెందినట్టు తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆర్.జయంతి చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు తెలిపారు.

### బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24సి. 10గ్రా.) | 60,380-00 |
| బంగారం(22సి. 10గ్రా.) | 55,350-00 |
| వెండి (కిలో) | 80,000-00 |

### కోడిగుడ్ల ధరలు

| హోల్‌సేల్ ధరలు | (100 గుడ్లు) |
|---|---|
| విశాఖపట్నం | రూ. 475.00 |
| విజయనగరం | రూ. 479.00 |
| శ్రీకాకుళం | రూ. 479.00 |

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹138 | ₹246 | ₹ 256 |

## ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

- జేసీ గోవిందరావు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

పార్వతీపురం: జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో ధాన్యం సేకరణకు సిద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ధాన్యం సేకరణకు గోనె బస్తాలను ముందస్తుగా సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ అన్నారు. అక్టోబరు నెలాఖరు నాటికి ఒక కోటి గోనె బస్తాలను సిద్ధం చేయాలని, అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని, సిబ్బంది నియామకం పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. యాప్‌ల వినియోగంలో సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆయన ఆదేశించారు. కూలీలు, రవాణాకు కార్యాచరణ ప్రణాళిక ఉండాలని ఆయనన్నారు. చెల్లింపుల యాప్‌లో నమోదు చేయాల్సిన వాహనాల వివరాలు సేకరించి ముందుగా నమోదుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. బ్యాంక్ గ్యారంటీ నిర్దేశిత సమయంలో ఇవ్వాలని ఆయన సూచించారు. మిల్లర్లు, రవాణా, గోనె సంచులు, బ్యాంక్ గ్యారంటీ, ఎల్రక్టానిక్ వేయింగ్ స్కేల్స్ తదితర అంశాలపై దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు.

**22న రవాణా కాంట్రాక్టర్లతో సమావేశం**

రైతు భరోసా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతోందని ఆయన అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైతు కల్లం నుండి లేదా నిర్దేశిత ప్రదేశం నుండి యాదృచ్ఛికంగా ఎంపిక చేసిన మిల్లులకు పంపడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ధాన్యం రవాణా చేయుటకు ముందుకు వచ్చిన రవాణా కాంట్రాక్టర్లు వాహనానికి జీపీఎస్‌ను సొంతంగా అమర్చాలని ఆయన చెప్పారు. రవాణా కాంట్రాక్టర్లతో ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల రవాణా కాంట్రాక్టర్లు ఈ నెల 15వ తేదీ నాటికి పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎమ్.దేవుళ్ల నాయక్, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఎల్.అశోక్ కుమార్, సహకార శాఖ సహాయ రిజిస్ట్రార్ ఆర్.రమణ మూర్తి, జీసీసీడీఎం వి.మహేంద్ర కుమార్, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు కొత్త కోట రమేష్, వైస్ ప్రెసిడెంట్ ఉదయ భాను, తదితరులు పాల్గొన్నారు.





## లక్ష్యాలను చేరుకోకపోతే చర్యలు తప్పవు

- ప్రగతి సమీక్షలో మండల స్థాయి అధికారులపై కలెక్టర్ నాగలక్ష్మి సీరియస్
- ఆరోగ్యసురక్ష సర్వే మరింత వేగవంతం కావాలని ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: అభివృద్ధి పనులు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోకపోయినా కఠిన చర్యలు తప్పవని మున్సిపల్, మండల స్థాయి అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ హెచ్చరించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి మంగళవారం జేసీ కె.మయూర్ అశోక్, ప్రత్యేక అధికారులతో కలసి ఆమె అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్షించారు. ప్రధానంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే, ఇళ్ల నిర్మాణాలు, ప్రభుత్వ భవన నిర్మాణాలు ఇతర పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె పలు అంశాలపై మార్గ నిర్దేశకాలు జారీ చేశారు. లక్ష్యాలను చేరుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను మరింత వేగవంతం చేయాలని, ప్రతి కుటుంబం నుంచి సేకరించిన వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతంలో అయితే 20 రోజుల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 15 రోజుల్లోగా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని చెప్పారు. భవిష్యత్తులో ఇవే వివరాల ఆధారంగా వైద్య చికిత్సలు ఉంటాయి కాబట్టి సర్వే విషయంలో అందరూ సీరియస్‌గా వ్యవహరించాలని పేర్కొన్నారు. రోజూ 40 కుటుంబాల వివరాలను సేకరించాలని స్పష్టం చేసారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. భౌతికంగా కంప్లీట్ అయిన ప్రభుత్వ భవనాలను అక్టోబర్ నెలాఖరు నాటికి అప్పగించాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో చేపట్టిన నిర్మాణాల పూర్తికి ప్రతి ఒక్కరూ సమష్టి కృషి చేయాలని చెప్పారు. డిసెంబర్ నాటికి ఎట్టి పరిస్థితుల్లో శతశాతం నిర్మాణాలు పూర్తి కావాల్సిందే అని పేర్కొన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా నమోదవుతున్న ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించాలని ఆదేశించారు.

**వంగర ఎంపీడీఓపై సీరియస్**

ముందస్తు సమాచారం ఇవ్వకుండా సెలవుపై వెళ్లిన ఎంపీడీఓపై కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ సీరియస్ అయ్యారు. వీసీలో భాగంగా ఆయన్ని పిలవపగానే రెస్పాండ్ కాలేదు. ఈఓపీఆర్‌డీ రెస్పాండ్ అయి సెలవు పెట్టారని చెప్పగా... ఎవరికి చెప్పి సెలవు పెట్టారని ఘాటుగా స్పందించారు. వెంటనే వచ్చి జడ్పీ సీఈఓని తనని కలవాలని ఆదేశించారు. జేసీ కే.మయూర్ అశోక్, ప్రత్యేక ఉప కలెక్టర్లు వెంకటేశ్వరరావు, సుదర్శన దొర, పద్మలత, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.